19న పద్మశాలీ ఫౌండేషన్ రజతోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ గజం నరసింగరావు

సుల్తాన్‌బజార్: ఈనెల 19న వరల్డ్ పద్మశాలీ ఫౌండేషన్ రజతోత్సవాన్ని సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ గజం నరసింగరావు అన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది మందికి విద్య, వైద్యం తదితర రంగాల్లో తోడ్పాటును అందిస్తున్నామన్నారు. ఈ మహోత్సవంలో భవిష్యత్తులో చేపట్టాల్సిన అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వేడుకలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు ఎస్.శ్రీనివాస్, గుంటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం'



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. గుడిమల్కాపూర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజా తీర్పు బీజేపీ పక్షానే ఉంటుందని, అందుకు ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే నిదర్శనమన్నారు. గత బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్‌ను ప్రజలు చిత్తుగా ఓడిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నామ యాదగిరి నేత, పాండు తదితరులు ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

నాంపల్లి: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజా మెన్షన్ హాల్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి ఉస్మాన్ మహ్మద్ ఖాన్ ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై నేతలకు ఖర్జూరం తినిపించి ఉపవాసాన్ని విరమింపజేయించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫిరోజ్ ఖాన్, మాజీ క్రికెటర్ అజహరుద్దీన్, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రోపాష బియబానీ, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ అధ్యక్షుడు రోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఉపవాస దీక్షలు, ఇఫ్తార్ విందులు జోరుగా సాగుతున్నాయి. నదీమ్ కాలనీలోని జహంగీర్ మసీదులో, మహ్మద్ నజీబ్ ఆధ్వర్యంలో గోల్కొండ నయాఖిలాలోని మదర్సాలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. టోలిచౌకీ రాహుల్ కాలనీలో సీనియర్ మజ్లిస్ నాయకులు సయ్యద్ వజాహత్ ఆలీ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.



ఇమాంపురాలో పక్కకు ఒరిగిన హైమాస్ట్ స్తంభం



శివ మందిర్ లేన్‌లో ఒరిగిన ఇనుప స్తంభం



మందిర్ లేన్‌లో వేలాడుతున్న సర్వీసు వైర్లు



మార్కండేయ నగర్‌లో తుప్పు పట్టిన స్తంభం

తుప్పు పట్టి..ప్రమాదకరంగా మారి!

- జియాగూడ డివిజన్‌లో ఇనుప స్తంభాలతో పొంచి ఉన్న ముప్పు
- మరోవైపు వేలాడుతున్న వైర్లు
- పట్టించుకోని కార్వాన్ విద్యుత్ శాఖ అధికారులు

జియాగూడ: డివిజన్‌లోని పలు ఇనుప విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి ప్రమాదకరంగా మారాయి. సుమారు 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినవి కావడంతో కాలక్రమేణా వాటి అడుగు భాగంలో చిల్లులు పడి ఒంగిపోయి ఉండగా మరోవైపు సర్వీస్ తీగలు వేలాడుతున్నాయి. ముఖ్యంగా జియాగూడలోని ఇమాంపురా హైమాస్ట్ ల్యాంప్, కార్వాన్ క్రాంతి భవన్ లేన్, శివ మందిర్ లేన్, మార్కండేయ భవన్, సర్కార్ దవాఖానా, జైన్ మందిర్ లేన్ తదితర ప్రాంతాల్లోని విద్యుత్ పోల్స్ డేంజర్‌గా ఉన్నాయి. ఈ స్తంభాల నుంచి షార్ట్ సర్క్యూట్, ఎర్తింగ్, ఏ మాత్రం గాలులు వీచినా వదులుగా ఉన్న సర్వీస్ తీగలు ఒకదానికి ఒకటి తాకి నిప్పురవ్వలు పడుతున్నాయని పలు బస్తీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఆంధ్రుని కార్వాన్‌లో ఒరిగిన స్తంభం

తుప్పు ఇనుప స్తంభాలు తొలగించాలి..



కార్వాన్‌లోని పలు బస్తీల్లో గల తుప్పు పట్టిన ఇనుప స్తంభాలను పూర్తిస్థాయిలో తొలగించాలి. వాటి స్థానంలో సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలి. ఈ విషయమై ఇటీవలే సమితి ఆధ్వర్యంలో గోషామహల్ డివిజన్ ఇంజినీరింగ్ అధికారికి వినతి పత్రం అందించినం. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి. – పడాల అనంత కృష్ణ, శివ శంకర సేవా సమితి అధ్యక్షుడు

ఇమాంపురాలో హైమాస్ట్ పోల్స్ మార్చాలి..



ఇమాంపురా చౌరస్తా, మునీందర్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్ల స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. అలాగే జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్, రేణుకా ఎల్లమ్మ టెంపుల్ చౌరస్తాలోని హైమాస్ట్ చతిరి లైట్లు సగానికి పైగా వెలగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి. – మధిర సత్యనారాయణ,ఎన్‌బీఎస్ అధ్యక్షుడు

ఆర్యవైశ్యులు రాజకీయంగా మరింత రాణించాలి

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

నాంపల్లి: ఆర్యవైశ్యులు రాజకీయంగా మరింత రాణించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో 'ఉయ్ ఆర్ వన్' పేరిట ఆదివారం ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశ రాజకీయాల్లో మార్పు కోసమే బీజేపీ ఆవిర్భవించిందని యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే అగ్రవర్ణాల్లో పేదలు ఉన్నారని, వారిని ఆదుకునేందుకు ఆర్యవైశ్యులు ముందుకు రావాలని కోరారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ..ఉత్తర, దక్షిణ భారతీయ వైశ్యులందరూ ఒకటేనని నిరూపించుకోవాలంటే ఇరువైపులా వివాహాలు జరగాలని ఆకాంక్షించారు. అప్పుడే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. అలా ముందుకు పోవడానికి మా ఇంట్లో జరిగిన వేడుకే నిదర్శనమని చెప్పారు. బీసీల్లో ఐక్యత వచ్చినట్లుగానే ఆర్యవైశ్యులందరూ ఒకే వేదికపైకి రావాలని కోరారు. అలాగే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పొందాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాధికారంతోనే ఆర్యవైశ్యుల హక్కులు పరిరక్షించబడుతాయని, అన్యాక్రాంతం అవుతున్న దేవుడి భూములను కాపాడుకోవాలని పేర్కొన్నారు.

కుల్సుంపురా వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

గోల్కొండ: కుల్సుంపురా పార్కు వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందా శ్రీధర్‌సాగర్, ఉపాధ్యక్షుడిగా జొన్నకుంటి మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా టి. శ్రీనివాస్, కోశాధికారిగా మనోజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. పార్కులో మరింత ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామని, అలాగే వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌తో పాటు పిల్లల ఆట స్థలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంకుమార్, మోహన్‌రావు, పి.కృష్ణ, వెంకటేశ్‌గౌడ్, నర్సింహాచారి, శంకర్ ఉన్నారు.



నూతన సభ్యులతో కుల్సుంపురా పార్కు ప్రతినిధులు

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభించిన బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్ తదితరులు

జియాగూడ: చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని కార్వాన్ అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి అమర్ సింగ్ అన్నారు. జియాగూడ మెయిన్‌రోడ్డు, ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయం, చౌరస్తా, 2బీహెచ్‌కే కూడలి, మరిగి మాతా ఆలయం, శివాజీ చౌక్ వద్ద సంఘ సేవకుడు ఆడాల చంద్రమోహన్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు జియాగూడ డివిజన్ బీజేపీ కార్యదర్శి ఆడాల ప్రణయ్‌కుమార్, యూత్ నాయకుడు ఆడాల హరీశ్ కుమార్ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా కోశాధికారి ఆర్.ప్రేమ్ కుమార్, కార్వాన్ అసెంబ్లీ కో కన్వీనర్ శివకుమార్ యాదవ్, అధ్యక్షుడు జగదీశ్ యాదవ్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సింహ, ముచ్చింతల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జగన్నాథప్ప, బీసీ మోర్చా అధ్యక్షుడు జిల్లెల వెంకటేశ్ యాదవ్, భాస్కర్ గుప్తా, నరేశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయాభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం



స్వీట్లు తినిపించుకుంటున్న కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: ప్రసిద్ధిగాంచిన లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు కేటాయించడంపై ఆలయ కమిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆలయ కార్యాలయంలో సభ్యులు ఆదివారం సమావేశమై సీఎం రేవంత్ రెడ్డి, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమయ్యిందన్నారు. ప్రస్తుత సీఎం నిధులు కేటాయిస్తూ సీఎం జీవో జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీని కలిసి ధన్యవాదాలు తెలుపుతామన్నారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు బి.మారుతీ యాదవ్, ఎం.చంద్రకుమార్, సాంస్కృతిక కార్యదర్శి వినోద్ కుమార్, మాజీ చైర్మన్లు బంగ్లా రాజు యాదవ్, కె.వెంకటేశ్, కె.విష్ణు గౌడ్, సి.వెంకటేశ్, మాణిక్ ప్రభు గౌడ్, పోసాని విజయ్ కుమార్, సి.రాజు కుమార్ యాదవ్, జె.లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

గోల్కొండ: మెహిదీపట్నం సంతోష్‌నగర్‌లోని సెయింటాన్స్ మహిళా కళాశాలలో ఆ కాలేజీ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఐపీఎస్ హర్షిత అతలూరితో పాటు పలువురిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విజయరాణి, స్వప్న వనమాల సన్మానించారు. ప్రముఖ వైద్యురాలు రూత్ జాన్ పాల్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ లింగ వివక్షకు స్వస్తి పలకాలన్నారు. అనంతరం ఐపీఎస్ హర్షిత మాట్లాడుతూ..తాను చదివిన కాలేజీలోనే సన్మానం పొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మూగ జయశ్రీ, కళాశాల సీడబ్ల్యూఎంఎస్ డైరెక్టర్ జె.కాయల్విి, కోఆర్డినేటర్ శ్రీకళ, డీన్ డాక్టర్ అనురాధా తదితరులున్నారు.



అధ్యాపక బృందంతో పూర్వ విద్యార్థినులు

కట్ట మైసమ్మ ఆలయాన్ని పునఃనిర్మించాలని వినతి

యాకుత్‌పురా: యాకుత్‌పురా రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా కూల్చివేసిన కట్ట మైసమ్మ ఆలయాన్ని పునఃనిర్మించాలని కోరుతూ ఈస్ట్ చంద్రానగర్ బస్తీవాసులు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెయిన్‌బజార్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈశ్వర్ యాదవ్, బస్తీవాసుడు రమేశ్ మాట్లాడుతూ.. పనుల్లో భాగంగా ఆలయాన్ని కూల్చేసిన రైల్వే కాంట్రాక్టర్ నూతన టెంపుల్ నిర్మిస్తామని చెప్పి సగంలోనే పనులు నిలిపేశారన్నారు. దేవాలయ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి విన్నవించామన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

యాకుత్‌పురా: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని రంగేళీ కిడికి, మౌలా కా చిల్లా, అమన్‌నగర్–ఏ ప్రాంతాల్లో పత్తర్‌గట్టి కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ నేపథ్యంలో రూ. 32 లక్షల నిధులతో మౌలాకాచిల్లా బస్తీలో సీసీ రోడ్డు వేస్తున్నామన్నారు. ఆయన వెంట మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మంచి గుర్తింపు



కార్యక్రమంలో గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తదితరులు

గోల్కొండ: సేవా కార్యక్రమాలతో సమాజంలో మంచి గుర్తించి వస్తుందని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గోల్కొండ నయాఖిలాలో విద్యార్థులకు ఆదివారం ఖర్జూరా పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ వారు మతాలకతీతంగా పండుగలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ తరపున బి.శ్రీకాంత్‌చారి, ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మహ్మద్ ఫహాద్ తదితరులు ఉన్నారు.

పాతబస్తీలో సందర్శకుల సందడి



చార్మినార్: ఓవైపు రంజాన్ మాసం..మరోవైపు వీకెండ్ కావడంతో పాతబస్తీ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. వినియోగదారులు పెద్ద సంఖ్యలో చార్మినార్‌కు తరలిరావడంతో చార్మినార్, మక్కా మసీదు, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్ తదితర ప్రాంతాలు రద్దీగా కనిపించాయి. సందర్శకులు పెరగడంతో చిరువ్యాపారాలకు సైతం గిరాకీ పెరిగింది. లాడ్‌బజార్‌లో మహిళలు తమ కుటుంబ సభ్యులతో గాజులను ఖరీదు చేస్తూ సరదాగా గడిపారు.

బీసీ సాధికారత భవన్‌లో సన్మాన సభ



మాధవీలత, వంగళ పూర్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ గంగపుత్ర అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ టేక్డిలోని బీసీ సాధికారత భవన్‌లో ఆదివారం సన్మాన కార్యక్రమం జరిగింది. మాధవీలత స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ మున్సిపాలిటీ, వంగళ పూర్ణ, స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌గా నియామకం కాగా వారిని ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో గంగపుత్ర న్యాయవాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గంగపుత్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పాకా సర్జన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపతి, జనరల్ సెక్రెటరీ అరవింద్ మాట్లాడుతూ.. బీసీ–ఏ రిజర్వేషన్లు చాలావరకు ఫేక్ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారిపై గంగపుత్ర అడ్వకేట్ అసోసియేషన్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మోహన్, మల్లేశ్, అడ్వకేట్లు పాల్గొన్నారు.

ఘనంగా కుసుమ ధర్మన్న జయంతి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో కుసుమ ధర్మన్న జయంతి వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణకు కుసుమ ధర్మన్న స్మారక జాతీయ జీవన సాఫల్యం పురస్కారాలును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్ మాట్లాడుతూ.. కుసుమ ధర్మన్న సాహిత్యాన్ని ప్రస్తుత తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కుసుమ ధర్మన్న రచనలు –సాహితీ సమాలోచన, కుసుమ ధర్మన్న కవన బేరి పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్, సిటీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వర్‌రావు, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాకుసుమ, కార్యదర్శి బడేసాబ్, సాహితీవేత్త ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, బిక్కి కృష్ణకు పురస్కారాలు ఇస్తున్న ఆచార్య ఇనాంక్ తదితరులు

విశ్వబ్రాహ్మణుల ఐక్యతకు కృషి

గన్‌ఫౌండ్రీ: విశ్వబ్రాహ్మణుల విశ్వకర్మల జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టి జాతి ఐక్యతకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ దాసోజి శ్రవణ్‌కుమార్ అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయనను రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల మాతృ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ దాసోజి శ్రవణ్‌ను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు

మహిళలు భారతీయ సంస్కృతి పరిరక్షకులు

నాంపల్లి: భారతీయ సంస్కృతిని మహిళలే కాపాడుతున్నారని, ఇందుకు వారు ప్రదర్శించిన కళలే నిదర్శనమని ప్రముఖ పాత్రికేయుడు హాస్యబ్రహ్మ శంకర నారాయణ అన్నారు. రమ్యానాయుడు ఆధ్వర్యంలోని రాగరమ్య సంస్థ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళా మందిరం వేదికపై ఆదివారం 'వనితా నీకు వందనం' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. ఆరేళ్లుగా రాగరమ్య సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 300 కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంగీత, నృత్య ప్రదర్శనలు చేసిన మహిళలను ఆయన అభినందించారు. సభకు రాగరమ్య వ్యవస్థాపకురాలు రమ్యా నాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథి, విశ్రాంత పోలీసు అధికారిణి ప్రేమారెడ్డి, సంగీత నృత్య గురువులు కల్పన, లక్ష్మి, శిరీష, అనంతలక్ష్మి, చక్రి మాస్టారు పాల్గొన్నారు.



సంగీత, నృత్య గురువులను సత్కరిస్తున్న శంకర నారాయణ

హైదరాబాద్ జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శిగా రాజేశ్

నాంపల్లి: హైదరాబాద్ జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శిగా ఆదారి రాజేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు లక్డీకాపూల్‌లోని పార్టీ కార్యాలయంలో సెంట్రల్ కో ఆర్డినేటర్ దాగిళ్ల దయానందరావు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఆలోవెళ్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు వై.గిరి సమక్షంలో నియామకపు పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా గోషామహల్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా బీసీ శేఖర్‌రావుకు నియామకపు పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీనిచ్చారు. రాబోయే జీహెచ్ఎంసీలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



దయానందరావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రాజేశ్

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నదని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఉగాది పురస్కారాలను రవీంద్రభారతిలో ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు పథకాలు తీసుకు వచ్చినట్లు గుర్తు చేశారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు మహిళలకు శ్రీ విశ్వావసు నారి పురస్కారాలు, బాలలకు ఉగాది బాల పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కూచిపూడి నృత్య గురువు డాక్టర్ వై.చలపతి శాస్త్రి, మేము సైతం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వప్న శ్రీనివాస్, న్యాయవాది రాధిక, భారత ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు లలిత, రమణారావు పాల్గొన్నారు.



కల్వ సుజాతను సత్కరిస్తున్న నాట్య గురువులు